# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక



THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు **M.O.** పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవుసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor : J. C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 9 ఏప్రియల్ 1989 సంచిక 9

## సంపాదకీయము

### "యేసు యిట్లనెను"

### ( Jesus Said )

మతసంబంధమైన విషయాల్లో సహృదయత కలిగియుండుట, సరియైన మార్గములో యుండుట అత్యావసరము. చాలమంది ప్రజలు తమ బోధకుల మాటలను అంగీకరించుచు వారి బోధ దేవుని వాక్య ప్రకారమున్నదో లేదో యని విచారింపరు; వారు లేఖనములను పరిశోధింపరు. ఏదైనా ఒక సంగతిని ఫలాని మానవుడు చెప్పినందువలన కాదు గాని దానిని దేవుడు తన గ్రంథములో చెప్పినందున మనము అంగీకరించవలెను. మనము లేఖనములను ప్రతి దినము పరిశోధించవలెను. బెరయలోని ప్రజలు పౌలు, సీలాలు చెప్పుచున్న సంగతులు లేఖనములలో ఆలాగున్నవో లేదో యని పరిశోధించుచు వచ్చిరి గనుక వారు ఘనులై యుండిరని చెప్పబడినది (అపొ. కా. 17 : 11).

బైబిలు ఒకనికి ఒక రీతిగాను, మరొకనికి ఇంకొక రీతిగాను బోధించుటలేదు. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము

అని అది ఒకనికి చెప్పి మరొకనికి చిలకరింపు పొందవచ్చునని అది బోధించుటలేదు. నీ కేలాగు బాప్తిస్మము పొందినను పరవాలేదని కొందరు చెప్పుచుందురు. గాని వారట్లు చెప్పినందువలన అది సరికాదు. ఒకవేళ దేవుడట్లు చెప్పియుంటే అది సరియగును గాని దేవుడట్లు చెప్పలేదు.

## సహవాసమును గూర్చి

మేము ఫలాని వాని సహవాసములో యున్నామని కొందరు చెప్పుచుందురు. దేవుని సత్యవాక్య వెలుగులో నడుచుకొను ప్రతివారు ఒండొరుల సహవాసములో నిత్యము ఉందురు. మేము ఆ సహవాసములోను, ఈ సహవాసములోను యున్నామని అప్పుడు చెప్పుకొనవుసరం లేదు. అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1 : 7). చీకటికి వెలుగునకు సహవాస మేమియు లేదు. నీతికి దుర్నీతికి సహవాస మేమియు లేదు, సత్యమునకు అసత్యమునకు సహవాస మేమియు లేదు.

## సంఘమును గూర్చి

"ఈ బండమీద నా సంఘమును కట్టుదును" అని యేసు చెప్పెను (మత్తయి 16 : 18). తన సంఘమునుగాక వేరొక దానిని నిర్మింతునని ఆయన ఒక్క మాటకూడ చెప్పలేదు. ఆయన తన సంఘమును కట్టెను. దైవిక హక్కువలన ఆయన సంఘము నిలిచియున్నది. ఆయన తన సంఘమును కట్టుదునని చెప్పిన కొన్ని మాసములకు అది స్థాపించ బడెను. దాని ఆరంభమునుగూర్చి మనము అపొ. కా. 2వ అధ్యాయములో చదువగలము. క్రీస్తు సంఘముగాక మిగతా సంఘములను

గూర్చిన ఆరంభమునుగూర్చి చదువవలెనంటే బైబిలు గాక వేరే పుస్తకములను మనము చదువవలెను. నేటి ఆధునిక డినామినేషన్లను బైబిలులో మనము కనుగొనలేము. ఈ డినామినేషన్లన్నియు క్రీస్తు తన సంఘమును స్థాపించిన కొన్ని వందల సంవత్సరముల తరువాత మొదలిడినవి.

“ఇది నాయిల్లు” అని నేను ఎవరితోనైనా చెబితే అది నా యిల్లని వారు అర్థము చేసికొందురు. యేసు ‘నా సంఘమును కట్టుదును’ అని చెప్పుచున్నప్పుడు ఆ సంఘము ఆయనదే యని మనము గ్రహించుకొనవలెను. దానిని ఆయన తన స్వరక్తమిచ్చికొనెను. దేవుడు తన స్వరక్తమిచ్చికొనిన సంఘము అది యని అపొ. కా. 20 : 28 లో చెప్పబడి యున్నది. ఆయన దానిని కొన్నాడు; దానికొరకు తన స్వరక్తాన్నే వెలగా యిచ్చాడు. అది ఆయనది. యుక్తవయస్సు కలిగిన ప్రతివాడును క్రొత్త నిబంధన సంఘమునుగూర్చి బాగుగా ఎరిగినవాడై యుండవలెను. దానిని గూర్చిన క్లుప్త చరిత్ర అపొ. కా. 2వ అధ్యాయములో మనకు ఈయబడినది. క్రీస్తు చనిపోయి, తిరిగి లేచి పరలోకమునకు ఆరోహణుడైన తరువాత మొట్టమొదటిగా సువార్త ప్రకటింపబడెను. దేవుని కుమారుని కొన్ని వారముల క్రితము ఎవరైతే సిలువవేసి చంపారో వారికే అపొస్తలులు. అనాడు క్రీస్తు సువార్తను బోధించిరి : వారు తమ ప్రభువునే సిలువ వేసిరని నిర్మొహమాటముగా పేతురు ఉద్ఘాటించెను. ఇటువంటి బోధవలన వారు తమ అపరాధమును గుర్తించగలిగిరి. సత్యసువార్త ప్రకటింపబడగా ఫలితము కనబడును. వారు పేతురు చేసిన ప్రసంగమును విని తమ హృదయములో నొచ్చుకొనిరి. ఇంకొక మాటలో యేసు దేవుని కుమారుడని వారు విశ్వసించిరి. ఆయనను హత్య చేయుటలో వారు అపరాధులని గ్రహించిరి. అయ్యలారా మేమేమి చేతుము ? అని పేతురును మిగిలిన అపొస్తలులను అడిగిరి. వారు మారుమనస్సు పొంది

క్రీస్తు నామమున పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను అని వారికి చెప్పబడెను (అపొ. కా. 2 : 38). వారు దాని ప్రకారము చేయగా క్రైస్తవులైరి. తమ పాపములనుండి రక్షింపబడిరి. అందువలన క్రీస్తు సంఘ సభ్యులైరి. ఆనాడు వారు క్రీస్తు సంఘసభ్యులెట్లయ్యారో అదే రీతిగా ఈనాడు ప్రజలు క్రీస్తు సంఘ సభ్యులు కాగలరు. యేసు ప్రభువు సువార్తను విని విశ్వసించి మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందినయెడల ఒకడు ఈనాడును క్రీస్తు స్థాపించిన సంఘ సభ్యుడు కాగలడు. అంతకు ఎక్కువగాని తక్కువగాని చేయ వీలులేదు. క్రీస్తు సువార్తగాక వేరొక దానిని విశ్వసించి దానికి లోబడినవారు క్రైస్తవులు గాక వేరొకటి యగుదురు.

## ఆయనను వెంబడింపగోరిన యెడల

"ఎవడైనను నన్ను వెంబడింప గోరినయెడల తన్ను తాను ఉపేక్షించుకొని, తన సిలువ నెత్తికొని నన్ను వెంబడింపవలెను" అని యేసు చెప్పెను (మత్తయి 16 : 24). క్రీస్తును ఈ రీతిగా వెంబడిప గోరువారు ఈ రోజుల్లో బహు అరుదుగా యున్నారు. తన్ను తాను ఉపేక్షించుకొనేవారు బహు తక్కువగా యున్నారు. మన సౌకర్యాలను, సుఖములను కోల్పోవుట అంటే మనకు ఇష్టముండదు. దేవుని కొరకు త్యాగంచేసే మనుషులు ఎక్కడో గాని మనకు అగుపడరు. క్రీస్తు సిలువకొరకు క్రైస్తవుడైన నీవు చేసే త్యాగము ఎంత ? కొంతమంది సువార్తికులు క్రీస్తు కొరకు పనిచేయకనే డబ్బు సంపాదించ గోరుదురు. కొందరు తమ భార్యా బిడ్డలను, గృహమును వీడి సువార్త కొరకు వెళ్ళలేరు. అట్టి వారిలో కనబడే త్యాగము శూన్యము.

సువార్తను బోధించుటకు క్రైస్తవు లందరు పురుషులేమి స్త్రీలేమి ఆసక్తి కలిగియుండవలెను. క్రీస్తు సువార్తను క్రైస్తవులే బోధించనియెడల ఇంకెవరు దానిని ప్రకటింతురు? "మీరు సర్వ

లోకమునకు వెళ్ళి సర్వ సృష్టికిని సువార్తను ప్రకటించుడి" యని క్రీస్తు ప్రభువు యిచ్చిన ఆజ్ఞ ఆయన మరల వచ్చేవరకు ప్రతి క్రైస్తవునికీ వర్తించును. సువార్తను బోధించే బాధ్యత కేవలము బోధకులదే కాదు గాని ప్రతి క్రైస్తవునిదీ యని మనము గ్రహించవలెను.

## ఈ లోక సంపాదనను గూర్చి

"ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతని కేమి ప్రయోజనము? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా నేమి యివ్వగలడు?" అని యేసు చెప్పెను (మత్తయి 16 : 26). ఈ లోక విషయములపై కొందరు ఆసక్తి కలిగి దేవుని మరచిన వారున్నారు. వారి ఆత్మీయ క్షేమము ఈ లోక సంగతులపై ఆధారపడి యున్నదని వారనుకొందురు. ఎంత సంపాదించుకొనినను వారు తృప్తి నొందక యున్నారు. అయితే ఈ లోకము నంతటిని సంపాదించుకొనిన తరువాత తన ఆత్మను పోగొట్టుకొనిన యెడల వానికేమి ప్రయోజనము? అని క్రీస్తువారు అడుగుచున్నారు. అందుకే ఆయన ఇట్లు బోధించెను: "భూమిమీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును. దొంగలు కన్నము వేసి దొంగిలించెదరు. పరలోకమందు మీకొరకు ధనమును కూర్చుకొనుడి; అక్కడ చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు. దొంగలు కన్నము వేసి దొంగిలరు............. ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చి యైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమునుగూర్చియైనను చింతింపకుడి; ఆహారముకంటె ప్రాణమును, వస్త్రముకంటె దేహమును గొప్పవికావా?.........కాబట్టి ఏమి తిందుమో యేమి త్రాగుదుమో యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి; అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు...........మీరు మొదట ఆయన రాజ్య

మును నీతిని వెదకుడి; అప్పుడవన్నియు మీ కనుగ్రహింపబడును" (మత్తయి 6 : 19-33).

ఈ లోక సంగతులు శాశ్వతములుకావు. వాటిని గూర్చి మనము చింతింపవలదని యేసు బోధించెను. కొందరు ఈ లోకధనాన్ని గూర్చి పాకులాడుచు తమ ఆత్మను నరకమునకు పంపింతురు; మరి కొందరు ఈ లోక భోగాలలో మునిగిపోయి నరకపాత్రులగుదురు. ఇంకా కొందరు శరీరాశలకు లోనై తమ ఆత్మను అపవాదికి అప్పగింతురు. ఈ లోకములో మనం ఉండేది కొన్ని దినములు మాత్రమే. మానవ జీవనము బహు స్వల్పమే. "రేపేమి సంభవించునో మీకు తెలియదు. మీ జీవము యేపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరివంటివారే" (యాకోబు 4 : 14).

రేపేమి సంభవించునో మనకు తెలియదు గనుక నేడు అను సమయముండగానే మనము నిత్యత్వానికి సిద్ధపడుదము. ఈ జీవితానంతరము యేసుప్రభువుతో పరలోకములో మీరు నిత్యము గడుప గోరుచున్న యెడల యేసుప్రభును నమ్ముకొనండి; మీ పాపములను విసర్జించి, ఆయన నామమును ఒప్పుకొనుచు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందండి. ఈరోజే మీకు సమీపములోయున్న క్రీస్తు సంఘమును దర్శించండి ! !

---

## క్రీస్తు మాటల విశిష్టత

పరిశుద్ధ గ్రంథంలో ప్రభువైన క్రీస్తు చెప్పిన మాటలు చాలా విశిష్టమైనవి. అవి ఏవనగా :

**1.** ఆత్మసంబంధమైనవి :—"శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునైయున్నవి" (యోహాను 6 : 63).

2. బలముగలవి :— "ఆయన వాక్యము అధికారముతో కూడినదై యుండెను గనుక వారాయన బోధకు ఆశ్చర్యపడిరి" (లూకా 4 : 32).

3. అనుపమానమైనవి :— "ఆ బంట్రౌతులు - ఆ మనుష్యుడు మాటలాడినట్టు ఎవడును ఎన్నడును మాటలాడలేదనిరి" (యోహాను 7 : 46).

4. దయ కనికరముతో కూడినవి :— "అప్పుడందరును ఆయనను గూర్చి సాక్ష్యమిచ్చుచు, ఆయన నోటనుండి వచ్చిన దయ గల మాటల కాశ్చర్యపడిరి" (లూకా 4 : 22).

5. ఆదరణ విచ్చేవి :— "ప్రభువు ఆమెను చూచి ఆమె యందు కనికరపడి - ఏడువవద్దని ఆమెతో చెప్పి దగ్గరకు వచ్చి పాడెను ముట్టగా మోయుచున్నవారు నిలిచిరి" (లూకా 7 : 13).

6. బోధించేవి :— "అప్పుడాయన నోరు తెరచి యీలాగు బోధింపసాగెను" (మత్తయి 5 : 2).

7. దేవునివి :— "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపనివానికి తీర్పు తీర్చువాడొకడు కలడు. నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12 : 48).

8. విశదపరచేవి :— "ఉపమానము లేక వారికి ఆయన బోధింపలేదు గాని ఒంటరిగా ఉన్నప్పుడు తన శిష్యులకు అన్నిటిని విశదపరచెను" (మార్కు 4 : 34).

9. గద్దించేవి :— "అందుకాయన తన శిష్యులవైపు తిరిగి, వారిని చూచి - సాతానా, నా వెనుకకు పొమ్ము. నీవు మనుష్యుల సంగతులను మనస్కరించుచున్నావు గాని దేవుని సంగతులను మనస్కరింపకున్నావని పేతురును గద్దించెను" (మార్కు 8 : 33).

10. అధికారముతో కూడినవి :—"ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె గాక అధికారముగల వానివలె వారికి బోధించెను" (మత్తయి 7 : 29).

11. నిత్యజీవముగలవి :—"సీమోను పేతురు - ప్రభువా, యెవనియొద్దకు వెళ్ళుదుము ? నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు" (యోహాను 6 : 68).

12. నిత్యమైనవి, గతించిపోనివి :—"ఆకాశమును భూమియును గతించును గాని నా మాటలు గతింపవు" (మార్కు 13:31).

13. తీర్పుతీర్చేవి :—"నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపనివానికి తీర్పు తీర్చువాడొకడు కలడు, నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12 : 48).

ప్రియ చదువరీ! క్రీస్తుయొక్క మాటలలోని విశిష్టతను గూర్చి నీవు తెలుసుకున్నావా? "సమయము సమీపించినది గనుక ఈ ప్రవచన వాక్యములు చదువువాడును, వాటిని విని యిందులో వ్రాయబడిన సంగతులను గైకొనువారును ధన్యులు" (ప్రకటన 1 : 3).

"తొట్రిల్లకుండ మిమ్మును కాపాడుటకును, తన మహిమ యెదుట ఆనందముతో మిమ్మును నిర్దోషులనుగా నిలువబెట్టుటకును, శక్తిగల మన రక్షకుడైన అద్వితీయ దేవునికి, మన ప్రభువైన యేసు క్రీస్తుద్వారా, మహిమయు మహాత్మ్యమును ఆధిపత్యమును అధికారమును యుగములకు పూర్వమును ఇప్పుడును సర్వయుగములును కలుగునుగాక, ఆమేన్ (యూదా 1 : 24-25).

—ఇసుకపట్ల ఇజ్రాయెల్, కాకినాడ-4.

# ప్రభువు దినమా లేక సబ్బాతు దినమా?

## ( The Lord's Day or the Sabbath ? )

ప్రభువు దినము ఆదివారం. అది శనివారంగాని సబ్బాతుగాని కాదు. ప్రభువు దినాన్ని సబ్బాతు అనడం పొరపాటు. వారములో మొదటి దినం ఆదివారము. శనివారము వారములో ఆఖరి దినం, అదే సబ్బాతు అయితే క్రైస్తవులు ప్రభువు దినాన్ని ఆచరించాలా ? లేక సబ్బాతు దినాన్ని ఆచరించాలా ? ఇది ప్రతివారు తెలిసికొన వలసిన ప్రశ్న.

## సబ్బాతు, విశ్రాంతి దినము

దేవుడు తాను చేసిన పని సంపూర్తి చేసి యేడవ దినమున అనగా సబ్బాతు దినమున విశ్రమించెను. అందుచేత మనం సబ్బాతు నాచరించవలెనని (ఆది 2 : 3) ఇది మాదిరి యని చెప్పుచున్నారు.

దేవుడు తన పనిని పూర్తిచేసి యేడవ దినమున అనగా సబ్బాతు దినమున విశ్రమించి "ఆ దినమును ఆశీర్వదించి పరిశుద్ధపరచెను". ఇది జరిగిన 2500 సంవత్సరముల వరకు సబ్బాతును పరిశుద్ధ ఆరాధన దినంగా ప్రతిష్ఠించి పరిశుద్ధపరచలేదు. ఐగుప్తు బానిసత్వమునుండి విడుదల పొందిన తరువాత ఇశ్రాయేలు సంతతికి సబ్బాతును విశ్రాంతి దినముగా దేవుడిచ్చియున్నాడు. దీనికి ముందు ఏ మనుష్యుడైనను ఏ ప్రయోజనము కొరకైనను సబ్బాతును ఆచరించినట్లు బైబిలులో వ్రాయబడలేదు. దేవుడు చేసిన కార్యం ఒకటి, దేవుడు మనుష్యులకిచ్చిన ఆజ్ఞ వేరొకటి.

దేవుడు పని సంపూర్తిచేసి తన పని యంతటియందు విశ్రమించి నందుకు సబ్బాతును యూదుల కివ్వలేదు. ఐగుప్తు బానిసత్వమునుండి వారి విడుదలను జ్ఞాపకము చేసికొనుటకు 'యూదులకు' సబ్బాతు నాచరించమని సెలవిచ్చెను (ద్వితీ 5 : 15).

# సబ్బాతు మరియు ధర్మశాస్త్రము

"సబ్బాతు" అను పదము బైబిలులో నిర్గమ 16 : 22; 23 లో మొట్టమొదట కనబడుచున్నది.

"ఆరవ దినమున వారు ఒక్కొక్కనికి రెండేసి ఓమెరుల చొప్పున రెండంతలు ఆహారము కూర్చుకొనినప్పుడు సమాజముయొక్క అధికారులందరు వచ్చి అది మోషేకు తెలిపిరి. అందుకు అతడు - యెహోవా చెప్పిన మాట యిది. రేపు విశ్రాంతి దినము......".

వెంటనే మోషే సబ్బాతును ఆచరించాలని యూదులకు ఆజ్ఞాపించలేదు. నిర్గమ 16 : 23 నుండి 26 వచనాల్లో ఆయన యిచ్చిన వివరము ఇశ్రాయేలీయులు పొందిన క్రొత్త అనుభవాన్ని ఋజువు చేయుచున్నది. సీనాయి పర్వతముపై యివ్వబడిన పది ఆజ్ఞలలో ఇది ఒక ఆజ్ఞ. "విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము" (నిర్గ 20 : 8-11).

ఐగుప్తు బానిసత్వము నుండి బయటికి వచ్చేవరకు సబ్బాతు ఆజ్ఞ ఇశ్రాయేలీయులకు ఇవ్వబడలేదు. సబ్బాతును ఆచరించాలనే ఆజ్ఞ కలిగిన చట్టము (ధర్మశాస్త్రము) సీనాయి పర్వతముపై ఇవ్వబడెను. "సీనాయి పర్వతముమీదికి దిగివచ్చి ఆకాశమునుండి వారితో మాటలాడి నీతియుక్తమైన విధులను, సత్యమైన ఆజ్ఞలను, మేలుకరములైన కట్టడలను ధర్మములను నీవు దయచేసితివి. వారికి నీ పరిశుద్ధమైన విశ్రాంతి దినమును ఆచరింప నాజ్ఞ ఇచ్చి నీ దాసుడైన మోషే ద్వారా ఆజ్ఞలను కట్టడలను ధర్మములను నీవు దయచేసితివి" (నెహెమ్యా 9:13, 14). ధర్మశాస్త్రము నిచ్చుటలో అది ఆయన పరిశుద్ధ విశ్రాంతి దినమని వారికి తెలియపర్చి, ఆచరించబడునట్లు వారికివ్వబడెను.

"విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచు కొనుము" అను ఆజ్ఞ ఐగుప్తు బానిసత్వమునుండి విడుదలపొందిన యూదులకు ఇవ్వబడినది. పది ఆజ్ఞలలో ఒక ఆజ్ఞయై యున్నది. "నీ దేవుడైన యెహోవాను నేనే. నేనే ఐగుప్తు దేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని" (నిర్గ 20 : 2).

## యూదులకు మాత్రమే

ధర్మశాస్త్రము మరెవరికి ఉద్దేశింపబడినది కాదు. "విశ్రాంతి దినమును జ్ఞాపకముంచుకొనుట" అను ఆజ్ఞ ఐగుప్తు బానిసత్వమునుండి విడిపింపబడుటకు గుర్తుగా యూదులకు ఇవ్వబడినది. "నీవు ఐగుప్తు దేశమందు దాసుడవై యున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహుబలము చేతను చాచిన చేతి చేతను నిన్ను అక్కడనుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతి దినము ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను" (ద్వితీ 5 : 15).

సబ్బాతు నాచరించాలని ఎవరికి ఆజ్ఞాపించబడెను? ఒకప్పుడు బానిసత్వము క్రింద నున్న యూదులకు. ఎందుకు? ఒక జ్ఞాపకముగా. ఒక బలమైన చేతిలోనుండి దేవుడే వారిని బయటికి రప్పించెను గనుక విశ్రాంతి దినము నాచరింపవలెనని ఆజ్ఞాపించెను.

ప్రశ్న : నేడు సబ్బాతును ఆచరించాలని పోరాడువారు ఐగుప్తు బానిసత్వమునుండి విడిపింపబడినందుకు జ్ఞాపకముగా సబ్బాతును ఆచరించుచున్నారా? సబ్బాతును ఆచరించే ఆజ్ఞ వారి పితరులది కాదని, వారిదేనని మోషే సెలవిచ్చాడు. "మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధన చేసెను. యెహోవా మన పితరులతో కాదు. నేడు ఇక్కడ సజీవులమైయున్న మనతోనే ఈ నిబంధన చేసెను" ద్వితీ 5 : 2, 3. నేడు సబ్బాతును ఆచరించాలని ఇంకా ధర్మశాస్త్ర కట్టడలను ఆచరించాలని చెప్పేవారు మోషే ఈ మాటలు

చెప్పినప్పుడు వీరు అక్కడ ఉన్నారా? "యెహోవా మన పితరులతో కాదు. మనతోనే ఈ నిబంధన చేసెను". నేడు ఇక్కడ సజీవులమై యున్న మనతోనే ఈ నిబంధన చేసాడా?

## సబ్బాతును ఆచరించుటలేదు

సబ్బాతును ఆచరించాలని చెప్పేవారు దాని ఆచరించలేక పోవుచున్నారు.

దేవుడు యూదులకు ఆజ్ఞాపించినపుడు, ఐగుప్తు బానిసత్వమునుండి విడుదలపొందిన తరువాత విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుమని ఆజ్ఞాపించెను. విధేయతతో దాని ఆచరించనియెడల దాని వలన ప్రయోజనము లేదు. దానిని ఆచరించక పోయినయెడల వారు దేవుని ఆజ్ఞను ఉల్లంఘించినట్లే. సబ్బాతును జ్ఞాపకముంచుకొనుట సబ్బాతును ఆచరించుటయే.

సబ్బాతును ఆచరించుటలో దహనబలులు అర్పణలు కూడ అవసరం. "విశ్రాంతి దినమున యేడాది వగు రెండు గొర్రె పిల్లలను నైవేద్య రూపముగాను, దాని పానార్పణముగాను నూనెతో కలప బడిన తూమెడు పిండిలో రెండు పదియవ వంతులను అర్పింపవలెను. నిత్యమైన దహనబలియు దాని పానార్పణమును గాక యిది ప్రతి విశ్రాంతి దినమున చేయవలసిన దహనబలి" (సంఖ్యా 28 : 9, 10). నేడు సబ్బాతును ఆచరించాలని చెప్పేవారు ఎక్కడ "దహనబలులు" అర్పణలు అర్పించుచున్నారు?

సబ్బాతు నాచరించుటనుగూర్చి దేవుడిట్లు చెప్పెను. "దానిలో నీవైనను నీ కుమారుడైనను నీ కుమార్తెయైనను నీ దాసుడైనను నీ దాసియైనను నీ పశువైనను నీ యిండ్లలోనున్న పరదేశియైనను ఏపనియు చేయకూడదు" (నిర్గమ 20 : 10). ఏపనియైనను ఎవరైనను, ఒక పశువైనను సబ్బాతు దినాన చేయుటకు అధికారము లేదు.

సబ్బాతును ఆచరించాలని చెప్పబడినవారు ఆ దినమున అగ్ని రాజబెట్ట కూడదు. "విశ్రాంతి దినమున మీరు యిండ్లలో ఎక్కడైనను అగ్ని రాజబెట్టకూడదని వారితో చెప్పెను" (నిర్గమ 35 : 3). ఈ ఆజ్ఞకు అవిధేయులైనవారు మరణశిక్ష నొందవలెను. "దానిలో పనిచేయు ప్రతివాడు మరణశిక్ష నొందును" నిర్గమ 35 : 2, 31 : 15; సంఖ్యాకాండము 15 : 32-36 లో విశ్రాంతి దినమున "కట్టెలు ఏరుచున్న ఒకని" చూచి దేవుని ఆజ్ఞ ప్రకారం అతన్ని రాళ్ళతో కొట్టి చంపినట్లు వ్రాయబడియున్నది.

నేడు విశ్రాంతి దినాన్ని ఆచరించుచున్న వాడెవడు? విశ్రాంతి దినమున కట్టెలు ఏరుటద్వారా అతిక్రమించిన వాని రాళ్ళతో కొట్టుటను గూర్చి మీరు విన్నారా? సబ్బాతును ఆచరించాలని చెప్పే వారే దానిని ఆచరించకపోవడం క్రొత్త దేమీ కాదు. సబ్బాతును ఆచరించాలనే ఆజ్ఞ దేవునిద్వారా యూదుల కివ్వబడినది. ప్రభువు దినానికి బదులు సబ్బాతును ఆచరించాలనే వారికి ఇది అత్యంత కష్టతరమైన విషయంగా కనపడుచున్నది.

## సబ్బాతు ఆచరణ ఆగిపోవాలి

మోషే ధర్మశాస్త్రము నందలి సబ్బాతు ఆచరణ అమలులో నుండదు. ఎందుకనగా దానికి బదులు క్రీస్తు నిబంధన అనగా క్రొత్త నిబంధన యివ్వబడింది అని హెబ్రీ 8 : 8.13 సెలవిచ్చుచున్నది.

"ఇదిగో యొక కాలము వచ్చుచున్నది. అప్పటిలో ఇశ్రాయేలు ఇంటివారితోను యూదా ఇంటివారితోను నేను క్రొత్త నిబంధన చేయుదును. అది నేను ఐగుప్తు దేశములోనుండి వీరి పితరులను వెలుపలికి రప్పించుటకై వారిని చెయ్యి పట్టుకొనిన దినమున వారితో నేను చేసిన నిబంధన వంటిది కాదు".

నేను "క్రొత్త నిబంధన" చేయుదునని దేవుడు చెప్పెను. 13 వ వచనాన్ని చదువుదాం: "ఆయన క్రొత్త నిబంధన అని చెప్పుటచేత

మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా నున్నది". ధర్మశాస్త్రంలో ఒక భాగం కొట్టివేయబడెనని దేవుడు చెప్పలేదు. క్రీస్తు ఈ విధంగా చెప్పెను. "ధర్మశాస్త్ర మంతయు నెరవేరువరకు దానినుండి యొక పొల్లయినను, ఒక సున్నయినను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను". క్రొత్త నిబంధన పాత నిబంధనకు బదులుగా యివ్వబడినది. సబ్బాతు ఏడవ దినము. సబ్బాతుకు బదులుగా ప్రభువు దినము అనగా ఆదివారాన్ని క్రైస్తవులకు దేవుడిచ్చెను.

క్రీస్తు సిలువపై మరణించుటద్వారా సబ్బాతును మన మీద నుండి తీసివేసెననునది నిర్వివాదాంశము. సబ్బాతును కలిగియున్న చట్టం రద్దుచేయబడింది.

దైవావేశము వలన పౌలు యిట్లు వ్రాసెను. "తగ్గిపోవుచున్న మహిమయొక్క అంతమును ఇశ్రాయేలీయులు తేరి చూడకుండునట్లు మోషే తన ముఖముమీద ముసుకు వేసికొనెను. మేమట్లు చేయక, యిట్టి నిరీక్షణ గలవారమై బహు ధైర్యముగా మాటలాడుచున్నాము. మరియు వారి మనస్సులు కఠినములాయెను గనుక నేటి వరకు పాత నిబంధన చదువబడునప్పుడు, అది క్రీస్తునందు కొట్టివేయబడెనని వారికి తేటపరచబడక ఆ ముసుకే నిలిచియున్నది" (2 కొరింథీ 3 : 13-14).

"ఆయన మన సమాధానమైయుండి మీకును మాకును ఉండిన ద్వేషమును, అనగా విధిరూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును, తన శరీరమందు కొట్టివేయుటచేత మధ్య గోడను పడగొట్టి మన ఉభయులను ఏకముచేసెను. ఇట్లు సంధిచేయుచు, ఈ యిద్దరిని తన యందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి......" (ఎఫెసీ 2:14-15).

"దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు

కొట్టి దాని మీాద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధముల నన్నిటిని క్షమించి ఆయనతో కూడ మిమ్మును జీవింపచేసెను" (కొలస్స 2 : 14).

ఈ విషయంలో సందేహపడవలసిన అవసరం లేదు. సబ్బాతును ఆచరించే ఆజ్ఞలుగల పాత నిబంధన అనగా యూదులకు అన్యులకు మధ్యనున్న ద్వేషమును క్రీస్తు మరణము రద్దు చేసెను.

యాజకత్వము మార్చబడి క్రీస్తు మెల్కీసెదెకు క్రమముచొప్పున యాజకుడయ్యెను. ఆ ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణ సిద్ధి కలుగ జేయలేదు. కనుక చట్టము మార్చవలసిన అవసరత ఏర్పడెను (హెబ్రీ 7 : 17-18). పాత నిబంధనకు బదులు నూతన నిబంధన యివ్వబడెను. దైవావేశము వలన అపొస్తలుడు ఖచ్చితముగా యిట్లు చెప్పెను. "యిదియును గాక యాజకులు మార్చబడిన యెడల అవశ్యముగా యాజక ధర్మము సహా మార్చబడును. (హెబ్రీ 7 : 12).

ధర్మశాస్త్ర విధులను ఆచరించాలని చేప్పేవారు ఆ కాలంలో నున్న యాజకత్వపు క్రమం చొప్పున జరిగించుచున్నారా ? బైబిలేమి చెప్పుచున్నదో గమనించండి.

"యాజకుడు మార్చబడిన యెడల అవశ్యముగా యాజక ధర్మము సహా మార్చబడును"

దైవావేశము చేత లేఖకుడు హెబ్రీ 10 : 9, 10 లో మొదటి నిబంధనయైన పాత నిబంధన, రెండవ నిబంధనయైన క్రొత్త నిబంధనను స్థిరపరచుటకు కొట్టివేయబడెనని తేటగా ఋజువు పరచుచున్నాడు.

"ఆ రెండవ దానిని స్థిరపరచుటకు మొదటి దానిని కొట్టివేయుచున్నాడు. యేసుక్రీస్తు యొక్క శరీరము ఒక్కసారియే అర్పింపబడుటచేత ఆ చిత్తమును బట్టి మనము పరిశుద్ధ పరచబడియున్నాము".

సబ్బాతును ఆచరించాలని చెప్పే "నిబంధన పలకలు" పది ఆజ్ఞలు క్రీస్తుద్వారా కొట్టివేయబడినవి.

"మొదటి నిబంధనకైతే సేవా నియమములును ఈ లోక సంబంధమైన పరిశుద్ధ స్థలముండెను...... రెండవ తెరకు ఆవల అతి పరిశుద్ధ స్థలమను గుడారముండెను. అందులో సువర్ణ ధూపార్తియు, అంతటను బంగారు రేకులతో తాపబడిన నిబంధన మందసముండెను. ఆ మందసములో మన్నాగల బంగారు పాత్రియు, చిగిరించిన అహరోను చేతి కర్రయు, నిబంధన పలకలును ఉండెను (హెబ్రీ 9 : 1-3, 4).

ధర్మశాస్త్రము కొట్టివేయబడుట అనగా పాత నిబంధనలో నున్న అన్ని విధులు నిబంధన పలకలు వాటిలో వ్రాయబడిన పది ఆజ్ఞలు, ఆ ఆజ్ఞలలో నున్న సబ్బాతు కొట్టివేయబడెను. సబ్బాతు క్రొత్త నిబంధనలో భాగము కాదు. క్రీస్తు మరణించిన నాటినుండి అందరికి అమలులోనున్న చట్టము క్రొత్త నిబంధన. అదే "యాజకత్వము యొక్క మార్పు". [సశేషం

—వి. యి. హోవర్డ్.

## "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు"

## ( Thou shalt have no other Gods before me)

పది ఆజ్ఞలను మనము రెండు భాగాలుగా చేయవచ్చును. మొదటి భాగము దేవునితో మానవునికి ఉండవలసిన సంబంధాన్ని తెలియజేయుచున్నది. రెండో భాగము మానవునికి మానవునితో ఉండే సంబంధాన్ని తెలియజేయుచున్నది. ఈ పది ఆజ్ఞలు దేవుని యెడల భయభక్తులను, మానవుని యెడల గౌరవాన్ని ఆదేశించు చున్నాయి. దేవుని యెడల మానవునికి ఉండవలసిన సంబంధాన్ని గూర్చి తెలియజేసే నాలుగు ఆజ్ఞలలో మొదటి ఆజ్ఞను ఈ పాఠంలో మనం కొంత గమనిద్దాం.

## దేవుడు ఒక్కడే

నిర్గమ 20:2-3లో దేవుడిట్లు చెప్పాడు: "నీ దేవుడైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తు దేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని; నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు".

"నీ దేవుడైన యెహోవాను నేనే" అని చెప్పుచు దేవుడు ఈ యాజ్ఞల నారంభించాడు. దేవుడు మొదట మండుచున్న పొద ద్వారా మోషేకు ప్రత్యక్షమయ్యాడు. నీవు వెళ్ళి ఐగుప్తులో బానిసలుగా యున్న ఇశ్రాయేలీయులను విడిపింపవలెనని అతనికి చెప్పాడు. ఆయన పేరేమిటి అని అడిగిన యెడల వారితో నేనేమి చెప్పవలెనని మోషే అడిగాడు. "అందుకు దేవుడు - నేను ఉన్నవాడను అనువాడనై యున్నానని మోషేకు చెప్పెను. మరియు ఆయన ఉండుననువాడు మీ యొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెననెను" (నిర్గ 3 : 13, 14). యెహోవా అనగా ఉండుననువాడు. ఆయన తనకుగా ఎల్లప్పుడు ఉన్నవాడు, నిత్యము ఉండువాడు-ఆయన మానవుడు ఆరాధించదగిన అత్యున్నత మూర్తి.

## దేవుని తెలిసికోవాలి

దేవుని ఉనికిని మానవుడు ఎరుగవలెను. నేనున్నానని నిరూపించుటకు ఆయన ప్రయత్నించడు. ఆయన సృష్టికర్త, సర్వశక్తిమంతుడు. ఆయన శక్తిని ఇశ్రాయేలీయులు ప్రత్యక్షంగా పలుమారులు చూచారు. ఐగుప్తు దేశముపైకి ఆయన రప్పించిన పది తెగుళ్ళు వారు మరచిపోలేదు. ఎర్ర సముద్రమును రెండు పాయలుగా చీల్చి సముద్రము మధ్య ఆరిన నేలను ఏర్పరచిన ఆయన శక్తిని వారు మరువలేదు. అందుకే "దాసుల గృహమైన ఐగుప్తు దేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని" అని చెబుతూ ఆయన కరుణాకటాక్షములను వారికి తెలియజేయుచున్నాడు.

"నేను తప్ప వేరొక దేవుడు నీకుండకూడదు". ఈ యాజ్ఞ ఇశ్రాయేలులో ప్రతి వ్యక్తికి ఇయ్యబడినది. దేవుడు ఒక జాతి దేవుడనిగాని, జనాంగముయొక్క దేవుడనిగాని గాక నీ యొక్కయు నా యొక్కయు దేవుడని మనము గ్రహించాలి. ఈ మొదటి ఆజ్ఞలో మానవుడెవరిని ఆరాధించాలో తెలియజేయబడింది. యిది విగ్రహారాధనను, అబద్ధ దేవతల ఆరాధనను, అనేక దేవుండ్ల ఆరాధనను ఖండించుచున్నది. "మన దేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా" యని యూదులు ప్రతిదినము వల్లించేవారు (ద్వితీ 6:4). "నేను యెహోవాను, మరి ఏ దేవుడును లేడు. నేను తప్ప ఏ దేవుడును లేడని" యెషయా 45:5లో వ్రాయబడియున్నది (యెష 44 : 46 : 9 కూడ చూడండి).

ఈ గొప్ప సత్యాన్ని ఇశ్రాయేలీయులు త్వరలోనే మరచిపోయి యితర దేవతలను సేవించారు. బయలు, అషేరా మొదలగు దేవతలను అన్యులవలె ఆరాధించారు. వారి యతిక్రమములను తగిన ప్రతిఫలాన్ని అనుభవించారు. దేవుడొక్కడే నిజదేవుడు గనుక ఆయన ఆజ్ఞలకు మానవులు విధేయత చూపుట అవసరం. అందుకే నీ దేవుడైన యెహోవాను నేనే; నేను తప్ప వేరొక దేవుడు నీకుండకూడదని ఆయన ఆజ్ఞాపించుచున్నాడు.

క్రొత్త నిబంధన గ్రంథములో ఈ యాజ్ఞ ఎట్లు వర్తింపజేయబడిందో తెలియజేయు అనేక వచనములున్నాయి. "ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెనని" యేసుప్రభువు తనను శోధించుచున్న అపవాదికి చెప్పాడు (మత్త 4 : 10). శాస్త్రులలో ఒకడు వచ్చి ఆజ్ఞ లన్నిటిలో ప్రధానమైన దేదని ఆయనడిగెను. "అందుకు యేసు - ప్రధానమైనది ఏదనగా ఓ ఇశ్రాయేలూ, వినుము; మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు. నీవు నీ పూర్ణాత్మతోను

నీ పూర్ణ వివేకముతోను, నీ పూర్ణ బలముతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునది ప్రధానమైన ఆజ్ఞ" యని చెప్పెను (మార్కు 12 : 28-30). మనకు ఒక్కడే దేవుడున్నాడని అపొ. పౌలు 1 కొరింథీ 8:6లో వ్రాశాడు. ఏథెన్సు పట్టణములో పౌలు ప్రవేశించినప్పుడు వారి పట్టణము అనేక విగ్రహములతో నిండియుండుట పౌలు చూచి వారి నిజదేవుని గూర్చిన సత్యాన్ని బోధిస్తూ యిట్లు చెప్పాడు: "మనము దేవుని సంతానమై యుండి, మనుష్యుల చమత్కార కల్పన వలన మల్చబడిన బంగారమునైనను వెండినైనను రాతినైనను దేవత్వము పోలి యున్నదని తలంచకూడదు" (అపో. కా. 17 : 29). తరువాత ఎఫెసీ 4 : 4, 6లో "శరీర మొక్కటే, ఆత్మయు ఒక్కడే ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణయందుండుటకు పిలువబడితిరి; ప్రభువు ఒక్కడే, విశ్వాస మొక్కటే, బాప్తిస్మ మొక్కటే, అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే" యని అతడు బోధించాడు.

## విగ్రహములకు దూరంగా యుండాలి

విగ్రహములను గూర్చి క్రైస్తవులు జాగ్రత్తగా యుండాలని క్రొత్త నిబంధన బోధించుచున్నది. "కాబట్టి నా ప్రియులారా, విగ్రహారాధనకు దూరముగా పారిపొండి" యని కొరింథీ పట్టణస్తులను అపో. పౌలు హెచ్చరించాడు (1 కొరింథీ 10 : 14). "చిన్నపిల్లలారా, విగ్రహముల జోలికి పోకుండ జాగ్రత్తగా ఉండుడి" యని భక్తుడైన యోహాను హెచ్చరించాడు (1 యోహాను 5 : 21). వీటన్నిటియొక్క మూల సూత్రము ఒక్కటే: "నీ దేవుడైన యెహోవాను నేనే; నేను తప్ప వేరొక దేవుడు నీకుండకూడదు".

విగ్రహము అంటే వెండి, బంగారము, రాయి, చెక్కలతో మల్చబడిన ప్రతిమలు మాత్రమే కాదు. మానవుడు తన జీవితంలో

దేవునికంటే దేనినైనా ఎవరినైనా ఎక్కువ ప్రేమిస్తే అది అతనికి విగ్రహమే. అనేకులు ప్రకృతినే ఆరాధిస్తారు. అట్టివారు సృష్టికర్తకు ప్రతిగా సృష్టాన్నే పూజించి సేవిస్తారు. అయితే దేవుడు యుగయుగములవరకు స్తోత్రార్హుడై యున్నాడు (రోమా 1 : 25).

కొందరికి తమ ధనమే వారి దేవుడు. మరికొందరికి తమ ఆరోగ్యమే వారి దేవుడు. ధనం కొరకు, మంచి ఆరోగ్యం కొరకు నేటి మానవుడు చేసే యత్నాలు, వెచ్చించే సమయం ఇంతా అంతా కాదు. "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతని కేమి ప్రయోజనము? ఒక మనుష్యుడు తన ఆత్మకు ప్రతిగా ఏమి ఇయ్యగలడు?" అని యేసు బోధించాడు (మత్తయి 16 : 26). ఆరోగ్యం కొరకు శరీరసంబంధమైన సాధకముల కంటే దైవభక్తి ఇప్పుడు, రాబోవు లోకములోను కూడ ప్రయోజనకరమై యున్నదని అపో. పౌలు 1 తిమో 4 : 7-8లో బోధించాడు.

మానవుని జీవితంలో దేవునికంటె ఏదైనా విద్యగాని, ధనముగాని, ఆరోగ్యం గాని, మరింకేదైనా గాని ప్రాముఖ్యత వహిస్తే అది అతనికొక విగ్రహమే కావచ్చును. అందుకే నేను తప్ప వేరొక దేవుడు నీకుండకూడదని యెహోవా ఆజ్ఞాపించాడు.

నీవు ఎవరిని సేవించుచున్నావు? లేక దేనిని సేవించుచున్నావు! దేవుని మనము ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలని యేసు ప్రభువు బోధించాడు. యేసుప్రభువు ఒకే ఒక్కడై యున్న దేవుని బయలుపరచాడు. ఆయనయందు విశ్వసించి, ఆయనకు లోబడువారికి మోక్షాన్ని ప్రసాదిస్తాడు.

—జాషువా గూటం

## యేసు రక్షించును

(Jesus Saves)

యేసు మానవుని వాని పాపమునుండి రక్షించుటకు ఈ లోకమునకు వచ్చెనని లేఖనములు విశదముగా బోధించుచున్నవి. యేసు తల్లియైన మరియకు దేవదూత యిట్లు చెప్పెను. "ఆమె యొక కుమారుని కనును. తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును, గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను" (మత్త 1 : 21). యేసు తానే ఈలాగు చెప్పెను. "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని అతనితో చెప్పెను" (లూకా 19 : 10). మరల ఆయన యిట్లు పలికెను. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు" (యోహా 3:16-17). పౌలు ఈలాగు వ్రాసెను. "పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది" (1 తిమో 1:15).

## మానవుడు రక్షించుకొనలేడు

అవును, యేసుక్రీస్తు నశించిన దానిని రక్షించుటకు పాపములోనున్న మానవుని రక్షించుటకు వచ్చెను. మానవుడు పాపముచేసి దేవునికి దూరమై లోకములో నిరీక్షణ లేని వాడై నందున తనను తాను రక్షించుకొనలేడు. తనవంటి ఒక మానవుడు రక్షించునని అతడు ఎదురుచూడలేడు. క్రీస్తు ఒక్కడే రక్షించును. ఎందుకనగా ఆయన దేవునియొద్ద నుండి ఆ ప్రయోజనము నిమిత్తమే పంపబడెను. రక్షణను

సాధ్యం చేయుట కొరకు మానవుని పాపముల నిమిత్తమై బలిగా తన రక్తమును చిందించుటకు యిష్టపడి మరణించెను. ఈ త్యాగాన్ని ఆయన చేసిన తరువాత మానవుడు దానిని అంగీకరించి, క్రీస్తు దేవుని కుమారుడని మనలను రక్షించు నిమిత్తము ఆయన చనిపోయెనని నమ్మవలెను. క్రీస్తునందలి నమ్మకమునకు ఋజువుగా పాపముల విషయమై మారుమనస్సు నొందవలెను. ఆయన దేవుని కుమారుడని ఇతరుల ఎదుట ఒప్పుకొని పాపముల క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. అదే దేవుని చిత్తమును నెరవేర్చుట. తద్వారా క్రీస్తు రక్తముతో అతడు సంబంధము కలిగియుండి దానివల్ల వచ్చు ప్రయోజనాన్ని పొందుచున్నాడు అనగా రక్షింపబడుచున్నాడు.

## రక్షించు విశ్వాసము

రక్షించు విశ్వాసాన్ని గూర్చి, దానియందు శక్తి ఉన్నదని మనం మాట్లాడవచ్చును. క్రీస్తునందలి విశ్వాసమే రక్షించు విశ్వాసము. అది ప్రభువు బోధకు, క్రీస్తు ఆజ్ఞలకు లోబడునట్లు చేయును. అదే రక్షించు విశ్వాసము. ఈ విశ్వాసము క్రీస్తుకొరకు మానసిక ఒప్పుదల మాత్రమే కాదు. అది సత్వరమే లోబడునట్టి విశ్వాసము. క్రీస్తు దేవుని కుమారుడని మనసులో ఒప్పుకొని ఆయన బోధలకు విధేయత చూపని యెడల అట్టి విశ్వాసము మృతమైనదని లేఖనములు బోధించుచున్నవి. యాకోబు 2వ అధ్యాయం చదవండి. యేసు రక్షించునను విషయం గమనింపతగినది. విశ్వాసము రక్షించుట కొరకు అనగా అది క్రీస్తునుగూర్చి ఒప్పింపజేసి ఆయన బోధకు విధేయత చూపునట్లు ఒకని నడిపించును. తద్వారా ప్రభువు ఒకని రక్షించుటకు అది ప్రయోజనకరమగును. పేతురు ఒక సందర్భములో బాప్తిస్మము రక్షించునని చెప్పెను (1 పేతురు 3 : 21). యేసు అపొస్తలులతో మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడని

చెప్పి వెంటనే ఈలాగు చెప్పెను. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16 : 16). బాప్తిస్మముద్వారా ఒకడు ఎట్లు రక్షింపబడగలడు? నీటిలో బాప్తిస్మము లేదా క్రొత్త జన్మ (యోహా 3.3-5) ఒక్కటి మాత్రమే రక్షించదు. నీటిలో ముంచబడుట లేదా బాప్తిస్మము పొందుట ద్వారా విశ్వాసముతో దేవుని ఆజ్ఞలు అంగీకరించినపుడు ఒకడు రక్షింపబడుట సాధ్యమని గ్రహించగలము. బాప్తిస్మము ద్వారా మాత్రమే ఒకడు రక్షింపబడునని లేఖనములు ఎక్కడా బోధించుట లేదు.

## రక్షించే సంగతులు

పేతురు పెంతెకోస్తు అను పండుగ దినమున యెరూషలేములో మీరు రక్షణ పొందుడని వారిని హెచ్చరించెను (అపొ. కా. 2 : 40). క్రీస్తు మారుమనస్సు పొందవలెనని లేదా నశించవలెనని అప్పటి ప్రజలకు బోధించెను (లూకా 13 : 3). సత్యము మిమ్ములను స్వతంత్రులనుగా చేయునని చెప్పెను (యోహా 8:32). ఒకడు రక్షింపబడుటకు క్రైస్తవ జీవితము అవసరము. దీని అర్థం ఏమిటి? రక్షింపబడుటకు చాలా మార్గాలున్నాయా? కొన్ని "సంగతులు" మనల్ని రక్షించగలవా? లేక రక్షకుడు క్రీస్తా? ఆయన రక్షకుడైతే రక్షణతో సంబంధం కలిగిన ఈ సంగతులన్నీ ఏమిటి? ఇదంతా సామాన్యమైన విషయమే. మనం వెనుకకు వెళ్ళి సత్యం గ్రహించినట్లయితే ఆయన బోధించిన విషయాలకు విధేయత చూపగలుగునట్లు మనం విశ్వసించిన యెడల ఆయన మనలను రక్షించును. ఉదాహరణకు: పెంతెకోస్తు దినాన పేతురు మిమ్మును మీరే రక్షించుకొనవలెనని చెప్పెను. క్రీస్తుకు దూరంగా నుండి మిమ్మును రక్షించుకొనుటకు మీరే శక్తి కలిగియున్నారని అతడు చెప్పలేదు. వారు లేచి ప్రభువుకు విధేయులగునట్లు

ప్రోత్సాహపరచి, వారి రక్షణ అవసరతను జ్ఞాపకము చేసి రక్షణను వారి ఎదుట నుంచెను. ఒకడు మారుమనస్సు పొందవలెనని లేదా నశించవలెనని క్రీస్తు బోధించెను. అతని చుట్టూ యున్నవారు నశింప కుండ విశ్వాసము ద్వారా, విధేయత ద్వారా వారి పాపముల నుండి మారుమనస్సు పొందాలని ప్రోత్సహించెను. దేవుని చిత్తమును అంగీకరించి, ప్రభువును విశ్వసించి సత్యముద్వారా నడిచిన యెడల సత్యము మిమ్ము ను రక్షించును. క్రైస్తవ జీవితము రక్షించునని చెప్పు చున్నాము. చివరిగా క్రీస్తు బోధను ఆధారం చేసికొని మంచిభక్తిగల జీవితమును జీవించి క్రీస్తు మార్గంలో నడిచిన సత్ఫలితాన్ని పొంద గలము.

## క్రీస్తులోను, సంఘములోను రక్షణ

రక్షణ క్రీస్తులోను, సంఘములోను ఉన్నదని మనం చెప్పు కొనవచ్చును. ముఖ్యంగా రక్షింపబడుటకు ఒకడు సంఘములో నుండవలెను. సంఘము రక్షించునని కొందరు చెప్పవచ్చును. సంఘము రక్షించదుగాని క్రీస్తు మాత్రమే రక్షకుడు అని స్పష్టంగా మనం అర్థం చేసికోవాలి. ఒకడు క్రీస్తునకు విధేయుడైనప్పుడు ఆయన అతని రక్షించును. తన సంఘముతో వానిని చేర్చును. ఒకడు రక్షింప బడితే అతడు ప్రభువు సంఘములో ఉండాలి. ఎందుకంటే రక్షించిన వారిని సంఘముతో క్రీస్తు చేర్చును. ఒక సత్యాన్ని మనం గట్టిగా చెప్పగలం. అదేమంటే ప్రభువు సంఘములో లేనివాడు నశించినవాడే. రక్షింపబడిన ప్రతివాడు రక్షింపబడిన వెంటనే ప్రభువు వానిని సంఘ ముతో చేర్చును.

క్రీస్తు రక్షకుడు, ఆయన మాత్రమే రక్షకుడై యున్నాడు. ఆయన లేకుండ మనల్ని మనం రక్షించుకోలేము. ఒక మానవుని వెంబడించుట ద్వారా మనం రక్షింపబడలేము. కొన్ని మంచిపనులు

చేయుటద్వారా మనం రక్షింపబడలేము. రక్షణలో అనేక సంగతులున్నాయి. అవి విశ్వాసము, విధేయత, మారుమనస్సు, ప్రార్థన, క్రైస్తవ జీవితము, ప్రభువు సంఘములో సభ్యునిగా నుండుట, ఆయన యెడల విశ్వాసము, విధేయత క్రీస్తుద్వారా ప్రవేశపెట్టబడిన సంగతులు. క్రీస్తుతో మనం సమస్తమును కలిగియున్నాము, ఆయన లేనప్పుడు మనం నిష్ప్రయోజనమైన వారము.

—జె.సి. ఛోట్.

---

## మణిపూర్‌లో క్రీస్తు సంఘాలు

భారత దేశంలో ఈశాన్యంగా యున్న ఒక చిన్న రాష్ట్రము మణిపూర్. ఈ రాష్ట్రం చుట్టూ అనేక కొండలు ఆవరించుకొని యున్నాయి. అయితే మణిపూర్ రాష్ట్రంలో క్రీస్తు సంఘము దినదినము అభివృద్ధి చెందుచున్నది.

ఈ రాష్ట్రానికి విదేశీయు లెవరు ప్రవేశించరాదనే చట్టమున్నది. గనుక సువార్త భారమంతా మణిపూర్‌లోని సహోదరులే స్వయంగా భరించుచున్నారు. మణిపూర్ లోయలో కనీసం 60 స్థానిక సంఘాలున్నాయి. అవన్నియు స్వయంపోషక సంఘాలే.

1989 మార్చి 22 నుండి 26 వరకు Bro. జాషువా కూటంగారు మణిపూర్ ముఖ్యపట్టణమయిన ఇంఫాల్‌లో బైబిల్ కేంపు, సువార్త కూటములు నిర్వహించారు. ఆయన కుటుంబ సమేతంగా అక్కడికి వెళ్ళారు. ఇంఫాల్‌లోని సంఘ ఆహ్వానము మేరకు వారు వెళ్ళి ఆ కార్యక్రమములో పాల్గొన్నారు. ఆ కూటములు నిర్వహించడంలో అయిన సమస్త ఖర్చులు ఇంఫాల్‌లోని సంఘములు భరించాయి.

అనేక మంది కూటములకు హాజరయ్యారు. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందారు. అనేకులు ఆత్మీయంగా బలపడ్డారు.

ఈ కూటములకు బర్మా దేశపు సరిహద్దు గ్రామాలనుండి కొందరు హాజరయ్యారు. వారి ద్వారా బర్మా దేశమునకు ఇప్పుడు సువార్త అందించబడుచున్నది. మణిపూర్‌లో యున్న క్రీస్తు సంఘాలు మనకు ఆదర్శం కావాలి. ఆత్మలను సంపాదించుటకు వారికి ఉన్న ఆసక్తి గొప్పది. స్వయంపోషకమైన మణిపూర్ క్రీస్తు సంఘాలను దేవుడు మెండుగా దీవించును గాక.

—ఎడిటర్.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYAWAKKU**
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To
..............................
..............................
..............................
..............................